

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | బుధవారం | నవంబర్ 29, 2023 | www.navatelangana.com



సామాజిక ఉద్యమానికి జ్యోతిబాపూలే నాంది

- అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే

2లో...



ఆఖిరి రోజు ఆకట్టుకునేలా ప్రచారం

- చివరి రోజు ఆదిలాబాద్ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ
- రోడ్ షోలో మాట్లాడిన బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న

5లో...

నిర్మల్‌లో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ

- రాళ్లు రువ్వుకొని, కర్రలతో దాడులు చేసుకున్న వైనం
- పోలీసుల రంగ ప్రవేశం తో సద్దుమణిగిన ఘటన



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో మంగళవారం బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు కావడంతో ఉదయం బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విశ్వనాథ్‌పేట్, వైఎస్ఆర్ కాలనీలో ప్రచారానికి వెళ్లారు. అప్పటికే బీఆర్ఎస్ నాయకులు అక్కడ

మిగతా..2లో...

ప్రచారం..సమాప్తం..!

- మూగబోయిన డీజే పాటల చప్పుడు
- పల్లెలు, పట్టణాల్లో అలుముకున్న నిశ్శబ్దం
- ఉమ్మడి జిల్లాలో ముగిసిన ప్రచార సందడి
- రేపటి పోలింగ్‌కు సిద్ధమైన యంత్రాంగం

రాజకీయ పార్టీల హోరాహోరీ ప్రచారానికి తెరపడింది. సుమారు నెల రోజుల పాటు హోరెత్తిన డీజే పాటల చప్పులు ఇక నుంచి వినిపించవు. ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5గంటలకు ముగిసిపోవడంతో ఎక్కడిక్కడ ప్రచార వాహనాలు నిలిచిపోయాయి. పల్లెలు, గల్లీల్లో మారుమోగిన అభ్యర్థుల ప్రచార పాటలు ఆగిపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాయంత్రం నుంచి నిశ్శబ్ద వాతావరణం అలుముకుంది. నెల రోజుల పాటు చెవులు గింకరించేలా వినిపించిన పాటల చప్పుళ్లు మూగబోవడంతో జనానికి ఊపిరి పీల్చుకున్నట్లయింది. ప్రచార సందడి ముగిసిపోవడంతో అంతిమంగా ఓటు వేయడమే మిగిలింది. ఇన్నాండ్లు ఆయా పార్టీలు, అభ్యర్థుల కోసం ముమ్మర ప్రచారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తలు చివరగా ఓటేయడమే మిగిలింది. ఈ నెల 30న నిర్వహించే పోలింగ్‌కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. సార్వత్రిక సమయంలో నువ్వా- నేనా అనే రీతిలో సాగిన ప్రచార పర్వానికి తెరపడటంతో అభ్యర్థులు సైతం ఊపిరి పీల్చుకుంటున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక సమరానికి వేళైంది. ఇన్నాండ్లు ప్రచార పర్వంతో రాజకీయాలను వేడెక్కించిన పార్టీలు తుదిపోరుకు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి ప్రచారంలో తీవ్రస్థాయిలో తలపడిన పార్టీలు చివరి అంకానికి

మిగతా..2లో...

నిర్మల్‌లో హోరాహోరీ..!


- ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోటీ
- మరో విజయం కోసం బీఆర్ఎస్ ప్రయత్నం
- పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీ యత్నం
- నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారిన ఎన్నికల సమరం


వివరాలు..2లో...

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోనే రాజకీయ కేంద్రంగా పిలువబడే నిర్మల్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు అన్ని ప్రధాన పార్టీలు ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ స్థానాన్ని మరోసారి దక్కించుకోవాలని చూడగా.. ఇక్కడ పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొనడం.. ముగ్గురు అభ్యర్థులు కూడా బలమైన వారు కావడంతో ఇందులో ఎవరు గెలుస్తారోనేని తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది. గత ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్ నుంచి గెలిచిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మరోసారి విజయం సాధించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. కాగా రెండు సార్లు ఓటమి చవిచూసిన కూచాడి శ్రీహరిరావు తాజాగా కాంగ్రెస్ నుంచి బరిలో దిగారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మహేశ్వర్‌రెడ్డి తాజాగా బీజేపీ నుంచి బరిలో దిగారు. వీరితో పాటు పలువురు స్వతంత్రులు సైతం బరిలో నిలవగా ఎవరు విజయం సాధిస్తారోననే ఉత్కంఠకు రేపుతోంది.







బీజేపీ నాయుకుని ఇంట్లో రూ.55లక్షలు పట్టివేత

- సొంత పార్టీ నాయకులే ఫిర్యాదు చేసినటుట్ల పుకార్లు

నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాధవరపు వెంకటరమణారావు ఇంట్లో సోమవారం రాత్రి రూ.55లక్షలను ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..హాజీపూర్ మండల కేంద్రంలోని రమణారావు ఇంట్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎలాంటి వివరాలు లేని రూ.55లక్షల నగదు గుర్తించి సీజ్ చేశారు. ఈ సోదాల్లో ఎఫ్ఎస్టీ సభ్యులు రాజన్న, ఎఎస్ఐ రాములు పాల్గొన్నారు. వారం రోజుల నుండి బీజేపీ నాయకులు అధికార బీఆర్ఎస్‌కు చెందిన మండలంలోని కొందరు సర్పంచులను కొనుగోలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వెంకటరమణరావు స్థానిక బీజేపీ నాయకులను పట్టించుకోకుండా ఎమ్మెల్యే అభ్యర్థి నుండి డబ్బులు తీసుకొచ్చి ఇష్టారీతిన కొనుగోలు కార్యక్రమాలు చేస్తున్నట్లు పుకార్లు వస్తున్నాయి. సదరు నాయకుడు పార్టీ సీనియర్లను పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడలకు పోవడంతో సొంత పార్టీకి చెందిన వారే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మండలంలో చర్చ జరుగుతోంది.



(మొదటి పేజీ తరువాయి)

ప్రచారం..సమాప్తం..!

సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే వివిధ రకాల తాయిళాలతో ఓటర్లను ఆకర్శించే ప్రయత్నం చేసిన పార్టీలు తుది నిర్ణయం ఓటరుకు వదిలేశారు. ప్రచారం ముగిసిపోవడంతో ఓటర్లు ఎవరిని కరుణిస్తారోననే ఉత్కంఠకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు, రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల తరపున 148మంది బరిలో నిలిచారు. మూడు ప్రధాన పార్టీల మద్యనే పోటీ రసవత్తవరంగా మారగా.. స్వతంత్రులు సైతం సత్తాచాటేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా ఆయా పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు ఉదయం నుంచి రాత్రి వరకు పల్లెలు, గల్లీలు అనే తేడా లేకుండా ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. విజయం కోసం ఎవరికి వారు తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక పార్టీలో ఉన్న నాయకులు మరోపార్టీలోకి వెళ్లడం.. అక్కడ్నుంచి ఇక్కడకు రావడం వంటి చేరికల పర్వంతో రాజకీయం వేడెక్కించింది. చివరకు ఎవరు ఎటువైపు ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

అగ్రనేతల ప్రచారంతో సందడి..!

ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచారం ఈ సారి గతానికి భిన్నంగా జరిగింది. ఈ సారి ప్రధాన పార్టీలన్ని ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ క్రమంలో ఆయా పార్టీల తరపున వారి అగ్రనేతలను రప్పించారు. బీఆర్ఎస్ తరపున సీఎం కేసీఆర్ పది నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనతో పాటు మంత్రి కేటీఆర్, హరీష్‌రావు పలుమార్లు వివిధ నియోజకవర్గాల్లో పర్యటించి శ్రేణులను ఉత్సాహ పరిచారు. ఇక కాంగ్రెస్ తరపున ఆ పార్టీ ఏఐసీసీ అగ్రనేతలైన రాహుల్‌గాంధీ ఆదిలాబాద్‌కు ప్రచారానికి రాగా..ప్రియాంకగాంధీ ఖానాపూర్, ఆసిఫాబాద్ సభలకు హాజరై ఆ పార్టీ శ్రేణుల్లో భరోసా నింపారు. ఇక బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారానికి ప్రధాని మోదీ నిర్మల్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకుముందు ఆ పార్టీ అగ్రనేత అమిత్‌షా ఆదిలాబాద్, మంచిర్యాల సభల్లో పాల్గొన్నారు. ఇక ఆయా పార్టీల రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వంటి నాయకులు సైతం ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. చత్తీష్‌గడ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సైతం ఆదిలాబాద్‌కు వచ్చిన ప్రచారం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వారం, పది రోజుల వ్యవధిలోనే ఉమ్మడి జిల్లాకు అగ్రనేతలు వరుసకట్టడంతో రాజకీయం రసవత్తరంగా మారింది.

రేపటి పోలింగ్‌కు సర్వం సిద్ధం..!

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించనున్న పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఇప్పటికే పీఓ, ఏపీఓ, ఓపీఓ వంటి అధికారుల నియామకం పూర్తిచేసిన యంత్రాంగం అవసరమైన ఈవీఎంలను కూడా సిద్ధం చేసింది. పోలింగ్ సిబ్బందిని యమించి వారికి విధులు కేటాయించడం వంటి చర్యలు పూర్తిచేసింది. కేవలం పోలింగ్ నిర్వహించడమే తరువాయిగా ఏర్పాట్లు పూర్తిచేసింది. నెలరోజుల పాటు ప్రచారం నిర్వహించిన అభ్యర్థుల భవితవ్యం రేపు ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. ఫలితాలను డిసెంబర్ 3న వెల్లడించనున్నట్లు ఎన్నికల అధికారులు చెబుతున్నారు. అప్పటి వరకు ఆయా పార్టీలతో పాటు అభ్యర్థుల్లో టెన్షన్ వాతావరణం కనిపించనుంది.

నిర్మల్‌లో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ

ప్రచారం చేస్తూ ఎదురయ్యారు. దీంతో ఒకరిపై ఒకరు వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. ఇది ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదానికి దారి తీసింది. ఇది కాస్త బాహాబాయికీ దిగేలా చేరుకుంది. ఘర్షణ ముదిరి రాళ్లు రువ్వుకొని, కర్రలతో దాడి చేసుకునే వరకు వెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఘర్షణను సద్దుమణిగించారు. కాలనీలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘర్షణలో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలకు కొందరు గాయాలయ్యాయి. ఈ సంఘటనతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు.

ఓటమి భయంతోనే ఈ దాడులు : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఓటమి భయంతోనే బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేశారని మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి విమర్శించారు. గత ఎన్నికల్లో సైతం ఇలాంటి దాడులకు పాల్పడ్డారన్నారు. కార్యకర్తలు శాంతియుతంగా ప్రచారం చేయాలని కోరారు.

ప్రజాదరణ ఓర్వలేకనే దాడులు : బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ప్రజల్లో తమకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఓటమి భయంతో బీఆర్ఎస్ నాయకులు ఓ ప్రణాళిక ప్రకారం దాడులకు దిగారని బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పనిగట్టుకొని ఘర్షణలకు దిగారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే తగిన బుద్ధి చెబుతామన్నారు.

నిర్మల్‌లో హోరాహోరీ..!

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాజకీయ కేంద్రమైన నిర్మల్‌లో ఎన్నికల పర్వం ఆసక్తికరంగా మారింది. ఇక్కడ మూడు పార్టీల మధ్య బలమైన పోటీ ఉండటంతో ప్రజల్లో ఉత్కంఠ రేపుతోంది. ఇక్కడి రాజకీయం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ బీఎస్పీ నుంచి విజయం సాధించిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో మరోసారి బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. తాజాగా మరోసారి గులాబీ పార్టీ నుంచి పోటీలో నిలిచారు. ఇక్కడ 2009, 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి బరిలోకి దిగిన కూచాడి శ్రీహరిరావు రెండు సార్లు ఓటమి పాలయ్యారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరి టికెట్ దక్కించుకొని మూడోసారి బరిలో నిలిచారు. ఇక 2009లో పీఆర్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైంది. అప్పటి నుంచి కాంగ్రెస్‌లో వివిధ పదవుల్లో కొనసాగిన ఆయన ఇటీవల బీజేపీలో చేరి తాజాగా కమలం గుర్తుపై పోటీ చేస్తున్నారు. ఇలా వీరితో పాటు మిగితా 10మంది స్వతంత్రులు, రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల తరపున బరిలో నిలిచిన వారు ఉన్నారు. వీరు సైతం గణనీయమైన సంఖ్యలో ఓట్లు సాధించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తికరంగా మారింది.

త్రిముఖ పోటీలో నెగ్గేదెవరూ..?

నిర్మల్ నియోజకవర్గంలో ప్రధానంగా మూడు పార్టీల మద్యనే పోటీ నెలకొంది.



బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మరోసారి విజయం సాధించాలని భావిస్తున్నారు. బలమైన నాయకుడిగా గుర్తింపు ఉండటం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజల్లో సొంతంగా పలుకుబడి ఉండటం వంటి అంశాలు విజయానికి సానుకూలంగా మారగా.. పార్టీకి చెందిన సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధుల్లో అసంతృప్తి ఉండటం, కొత్తగా చేరిన ప్రాధాన్యత ఇస్తున్నారని పాత నాయకుల్లో అసంతృత్తి వంటి అంశాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన శ్రీహరిరావు ఇది వరకు రెండు సార్లు పోటీ చేసినా ఓటమి చెందారు. ఈ సారి విజయం సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కాగా ఈ ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి పనికొస్తుందని, ప్రజల్లో ఉండటంతో పాటు కాంగ్రెస్ గాలి వీయడం వంటి అంశాలు సానుకూలంగా ఉండగా కింది స్థాయిలో బలమైన ద్వితీయ స్థాయి కేడర్ లేకపోవడం వంటి అంశాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక బీజేపీ నుంచి బరిలో నిలిచిన మహేశ్వర్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని పట్టుదలతో ఉన్నారు. గతంలో చేసిన అభివృద్ధితో పాటు మోడీ చరిష్మా వంటి అంశాలు విజయానికి సానుకూలంగా మారగా స్థానికంగా ఉండకపోవడం..ఎక్కువగా రాజధానికే పరిమితమవుతారనే ప్రజల్లో అభిప్రాయం ఉండటం ప్రతికూలంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇలా ముగ్గురు అభ్యర్థులు ఎవరికి వారు విజయం కోసం తీవ్రంగా శ్రమించడం నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారింది. ఇందులో ఎవరు విజయం సాధిస్తారో డిసెంబర్ 3న వెల్లడికానుంది.

సామాజిక ఉద్యమానికి జ్యోతిబాపూలే నాంది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

దేశంలో సామాజిక ఉద్యమానికి నాంది పలికింది మహాత్మా జ్యోతిబాపూలే అని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆవరణలో గల జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంఘ కార్యకర్తలతో కలిసి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, చిన్న కులాల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం ఆజన్మాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. అలాగే దేశంలో స్త్రీల విముక్తి కోసం, స్త్రీ విద్యకు 1848లో భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి నాంది పలికిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావుపూలే అని అన్నారు. పూలే దంపతులు చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి భారత ప్రభుత్వం దంపతులకు 'భారతరత్న' బిరుదు ఇచ్చి గౌరవించాలని కోరారు. పూలే దంపతుల జీవిత చరిత్రలను పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలని, స్త్రీ విద్యకు నాంది పలికిన సావిత్రిబాయి పూలే పేరును కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలకు పెట్టాలని డిమాండ్ చేశారు. జ్యోతిబా పూలే దంపతుల సామాజిక వర్గమైన మాలీ కులం తెలంగాణలో ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబడిపోయి ఉందని తెలిపారు. ఆంధ్రాలో మాలీలు ఎస్టీలుగా, తెలంగాణలో బీసీలుగా ఉండడంతో 22 సంవత్సరాలుగా మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని పోరాటాలు చేస్తున్నామన్నారు. పోరాట ఫలితంగా అసెంబ్లీలో తీర్మానం పాసై ఆమోదం కోసం పార్లమెంటుకు పంపిన బిల్లును అన్ని రాజకీయ పార్టీలు బిల్లును ఆమోదింపజేసి మాలీలకు సామాజిక న్యాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శెండే, మాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ అంబేకర్, పట్టణ అధ్యక్షులు శ్రీను ఆచారి, ప్రధాన కార్యదర్శి సుభాష్ శెండే, కార్యవర్గ సభ్యులు అనిల్ కోట్రంగే, కల్పన పెట్కులే పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

నవతెలంగాణ-దండేపల్లి

రెండు రోజుల్లో పెండ్లి..అందరూ పెండ్లి పనుల్లో హడావిడిగా ఉన్నారు. హఠాత్తుగా ఊహించని పరిణామం. వరుడు ఒక్కసారిగా కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఇంటి వద్ద బావిలో శవమై కనిపించాడు. ప్రమాదవశాత్తు బావిలో పడి వరుడు వినయ్‌కుమార్(28) మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. అందరితో కలివిడిగా ఉండే వినయ్‌కుమార్ ఒక్కసారిగా మరణించాడనే వార్త అందరినీ కలిచివేసింది. మండల కేంద్రానికి చెందిన పెండ్యాల వినయ్‌కుమార్ రైల్వే శాఖలో ఉద్యోగం సాధించి గూడ్స్ గాడ్‌గా పని చేస్తున్నాడు. తెల్లారితే బుధవారం పెండ్లి భాజలు మోగాల్సిన ఇంట్లో చావు డప్పులు విన్పించాయి. సోమవారం ప్రమాదవశాత్తు ఇంట్లోని బావిలో పడిపోయాడు. దీన్ని ఎవరూ గమనించలేదు. కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్ల వెతికారు. కానీ ఆచూకీ లభించలేదు. మంగళవారం బావిలో శవమై తేలాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. గోదావరిఖనికి చెందిన యువతితో వివాహం జరగాల్సి ఉండగా హఠాత్పరిణామంతో విషాదఛాయలు అలుముకున్నాయి. వినయ్‌కుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

దండేపల్లి : ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన అడప ప్రశాంత్(33) మృతి చెందాడు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..ప్రశాంత్ ఈ నెల 21న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రశాంత్‌కు 13 సంవత్సరాల క్రితం పెండ్లి అయింది. భార్యాభర్తల మధ్య సఖ్యత లేకపోవడంతో విడాకులయ్యాయి. అప్పటి నుండి ఒంటరిగానే ఉంటున్నాడు. తనకున్న భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంత కాలంగా సాగులో నష్టాలు రావడంతో మనస్థాపం చెంది గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద పురుగులమందు తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు తెల్లియజేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయినా ఫలితం లేక మంగళవారం మృతి చెందాడు. తండ్రి కడప శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
బుధవారం నవంబర్ 29, 2023

బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపించాలి

నవతెలంగాణ-ముధోల్

బీఆర్ఎస్‌ను ఆదరించి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకురాలు రమాదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జీఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల అభివృద్ధికి పాటు పడుతూ అందరికి అందుబాటులో ఉన్న నాయకుడు విఠల్‌రెడ్డి అని అన్నారు. మరోసారి విఠల్ రెడ్డికి ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎందరో నాయకులు ఎన్ని ప్రలోభాలు పెట్టిన ఎవరి మాట నమ్మకుండా పనిచేసే నాయకుడికి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, మాజీ ఎంపీపీ ఎజాజోద్దీన్, నాయకులు పోతన్న యాదవ్, ఖాలీద్, ఇమ్రాన్, సంజీవ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

నవతెలంగాణ-కుభీర్



తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు జావిద్‌ఖాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు, పల్సి, పల్సి తండా, పార్డి(బి) గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముధోల్ తాలూకాలో 10 సంవత్సరాల కాలం పాటు ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. అదే విధంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2వేల 500 ఆర్థిక సాయం వంట గ్యాస్ రూ.500 యువ వికాస్ కింద రూ.5లక్షలు ఆడపిల్ల పెండ్లి కొరకు తులం బంగారంతో పాటు కనుక అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణరావు పటేల్‌ను చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జైరాం, బంక బాబు, బషీర్‌ఖాన్, విలాస్ ఉన్నారు.

నేడు అడెల్లి పోచమ్మ వద్ద బహిరంగ వేలం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో శ్రీ మహా అడెల్లి పోచమ్మ అమ్మవారి ఆలయ సన్నిధిలో బుధవారం ఉదయం 11 గంటలకు టెంటు సామాను, వంట పాత్రలు కిరాయికి ఇచ్చుకొను హక్కు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి రంగు రవి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం వరకు కాలపరిమితి ఉంటుందని ఆసక్తి ఉన్నవారు రూ.75వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చునని తెలిపారు.

ఈవీఎంల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-ముధోల్

అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 30న జరుగనున్న నేపథ్యంలో బుధవారం ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా ముధోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద ఈవీఎంల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డి తెలిపారు. 311 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. బుధవారం ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపనున్నట్టు పేర్కొన్నారు.

ప్రశాంతంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రశాంతంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు వారి విధులపై, జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు లక్ష్మణ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికలలో ముఖ్యమైన ఘట్టం కౌంటింగ్ అని ఎలాంటి పొరపాట్లు జరగకుండా కౌంటింగ్ విధులు నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ కొరకు కేటాయించబడిన సిబ్బంది అందరూ పూర్తి అవగాహనతో పాటు సమయస్ఫూర్తి కలిగి ఉండాలని అన్నారు. కౌంటింగ్‌లో భాగంగా ముందుగా పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించాలని అన్నారు. ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని, కౌంటింగ్ కేంద్రాన్ని నిర్మల్ కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను ఇక్కడే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపులో భాగంగా సిబ్బంది అందరికీ ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా..

నవతెలంగాణ-కడెం



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రైవర్ లేకుండా ఆటోనే ఎక్కాం, ముఖ్యమంత్రి ఎవరో తెలియని వివిధ రాజకీయ పార్టీలకు ఓటు ఎలా వేస్తారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తాను కృషి చేస్తానని అన్నారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్‌తో పాటు పాలిటెక్నిక్ కాలేజీని ఏర్పాటు చేస్తానని అన్నారు. నియోజవర్గంలోని 500 యువకులకు ఉద్యోగాలు కల్పిస్తానికి భరోసా ఇచ్చారు. నూతన బస్టాండ్ భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి నిర్మాణాలు చేపడతానని తెలిపారు. మైనార్టీలకు షాదీఖానా, కబరస్తాన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల్ జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫిక్ అహ్మద్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, కడెం సర్పంచ్ కొండాపురం అనూష లక్ష్మణ్, పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, కడెం ఉపసర్పంచ్ ఎండీ ఆజం, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎండీ హసీబ్, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే హైమద్, ఖానాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయిని మంగ, బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి ముబారక్‌బిన్ మొహమ్మద్, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారంలో భాగంగా మేనిఫెస్టోను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కుభీర్

ఎన్నికల నేపథ్యంలో చివరి రోజు ప్రచారంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు పార్డి(బి) మలేగాం, సోనారి, డోడర్నాతో పాటు అన్ని గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు కార్యకర్తలతో గ్రామంలోని ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించారు. రానున్న రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం పేద మధ్య తరగతి ప్రజలకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు నూతన పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామని, 10 సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ముధోల్ నియోజకవర్గంలో మూడోసారి ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎన్నిల అనిల్ వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ గంగా చరణ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్ కోరారు. అదే విధంగా రెండు రోజుల పాటు కీలకంగా పార్టీని గెలిపించేందుకు సాయ శక్తులుగా కృషి చేయాలని అన్నారు. మళ్లీ మూడోసారి తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుతోనే వెంటనే రైతులకు రైతుబంధు డబ్బులు తమ బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, సూది రాజన్న, పుప్పాల పీరాజీ, నగలింగం, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు యఖినోద్దీన్, స్వామి, లక్ష్మణ్, శేరి సురేష్ బాబు, మహిపాల్‌రెడ్డి, దత్తుహరి పటేల్, నర్సారెడ్డి ఆయా గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-కడెం

అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు రవీందర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆకొండపేట్, అంబారిపేట్, పాండ్వాపూర్, లక్ష్మీపూర్, కల్లెడ, దోస్త్ నగర్ గ్రామాల్లోని అసైన్డ్ భూముల సమస్యను బీఆర్ఎస్ ప్రభుత్వం గెలిచిన వెంటనే పరిష్కరిస్తుందని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో జాన్సన్ నాయక్‌ను గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం జాన్సన్ నాయక్ పోటీ చేస్తున్నారని తెలిపారు. మండలంలోని 40 కోట్లతో లక్ష్మీపూర్ ఎత్తిపోతల పథకం చేపట్టి ఆ ప్రాంత ప్రజలకు, తాగునీరు, సాగునీరు ఎలాంటి కొరత లేకుండా చూస్తామని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట మహిళలు, రవీందర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అభ్యర్థి జాన్సన్ నాయక్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన మహిళలకు కండువా కప్పుతున్న రవీందర్‌రావు

ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

శాసనసభ నియోజకవర్గ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30వ తేదీన జిల్లాలోని 002-చెన్నూర్, 003-బెల్లంపల్లి, 004-మంచిర్యాల నియోజకవర్గాలకు జరుగనున్న పోలింగ్ సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించి మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం వద్ద ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, రాజస్వ మండల అధికారి రాములుతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో 227, బెల్లంపల్లి నియోజకవర్గంలో 227, మంచిర్యాల నియోజకవర్గంలో 289 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈవీఎం ర్యాండమైజేషన్ ద్వారా అన్ని పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆయా అసెంబ్లీ స్థానాలలో పంపిణీ కేంద్రాలకు బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సకాలంలో బయలుదేరడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి



నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఎస్పీ చల్లా ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు, కేంద్ర బలగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో కేంద్ర బలగాలు, జిల్లా పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఓటర్లకు భయాందోళనలకు అవకాశం లేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వేయడంలో భరోసా కల్పించడంలో భాగంగా ఫ్లాగా మార్చ్, రూట్ మార్చ్‌లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల రోజు, ఎన్నికల తరువాత బందోబస్తు విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఎన్నికల రోజు క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో స్టాటిక్ బందోబస్తు, మిగతా ఫోర్స్ రూట్ బందోబస్తు, అత్యవసర పరిస్థితి సమయంలో విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్‌టీ టీమ్స్ డ్యూటీలు, చెక్ పోస్టు విధుల గురించి వారికి వివరించారు. కీలకమైన పాయింట్‌ల వద్ద కేంద్ర బలగాల సిబ్బందిని ఉంచడం జరుగుతుందని అన్నారు. 8 కంపెనీలు కేంద్ర బలగాల ఉండటానికి సరైన వసతి ఏర్పాట్లు చేయాలని, వారితో కలిసి పనిచేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల వద్ద జాగ్రత్తగా ఉండాలని, ఓటింగ్ పూర్తి అయ్యేవరకు బందోబస్తులో జాగ్రత్తగా భద్రతా సిబ్బంది ఉండాలని అన్నారు. ఓటింగ్ ఆనంతరం ఈవీఎం బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ వీరన్న, అదనపు ఎస్పీ (ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, కేంద్ర బలగాల అధికారులు, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు రమేష్, రాంనిరంజన్ పాల్గొన్నారు.

గూడెం ఆలయ ఆదాయం రూ.34.40లక్షలు



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని మంగళవారం దేవాదాయ ధర్మదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్, ఆలయ వ్యవస్థాపక కుటుంభ సభ్యులు గోవర్ధన రఘు స్వామి ఆధ్వర్యంలో లెక్కించినట్లు ఆలయ నిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్ తెలిపారు. 89 రోజులకు హుండీ లెక్కింపు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి జాతరకు గాను హుండి లెక్కింపు, వ్రతాల టికెట్స్, ప్రసాదాలు, అన్నదానం, మిశ్రమ బంగారం 9 గ్రాములు మిశ్రమ వెండి 650 గ్రాముల ద్వారా మొత్తం రూ.34,40,743 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ సిబ్బంది, సత్యనారాయణ స్వామి సేవ సమితి సభ్యులు అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ గన్‌మెన్లు లేకుండా చెన్నూరుకు రాగలరా? : తీన్మార్ మల్లన్న



నవతెలంగాణ-చెన్నూర్

కేసీఆర్, కేటీఆర్, బాల్క సుమన్లు గన్మెన్ లేకుండా ఇల్లు కూడా దాటలేరని, చెన్నూరు నడిబొడ్డున వచ్చి వెళ్లగలరా అని తీన్మార్ మల్లన్న సవాల్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రతాప మారుతి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన రోడ్ షోలో పాల్గొని ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది కేసీఆర్ అని, నిరుద్యోగులకు మొండి చేయి చూపించారని అన్నారు. ఆనాడు తెలంగాణ కోసం 1200 మంది అమరులు చావు నోటిలోకి వెళ్తే, ఈయన డ్రామాలు చేసి చావు నోట్లోకి వెళ్లి వచ్చానని అబద్ధాలు చెప్పారన్నారు. 1200 మంది అమరులకు బదులు ఈయన ఒక్కడు పోయి ఉంటే రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలేదని అన్నారు. పదేళ్లలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని అసమర్థుడు కేసీఆర్ అని అన్నారు. ఇక నిన్న జరిగిన రోడ్‌షోలో కేటీఆర్ మాట్లాడుతూ బాల్కసుమన్ చేతిలో వివేక్ వెంకటస్వామి ఓటమి ఖాయమని, రాజకీయ సమాధి కాయమని అనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కేటీఆర్, బాల్క సుమనులు పిచ్చుక లాంటివారని, వివేక్ వెంకటస్వామితో పోటీ కేసీఆర్‌తోనే ఉంటుందని అన్నారు. ఇక నోట్ల వర్షంతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారని, నోటు బీఆర్ఎస్‌ది, ఒట్టు తీన్మార్ మల్లన్నది, ఓటు కాంగ్రెస్‌కి వేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మాట్లాడుతూ బాల్కర్ సుమన్‌ను ఓడించి బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని అన్నారు. ఇక వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ పదేళ్లలో టీఆర్ఎస్ రౌడీ రాజ్యం, అక్రమ ఆస్తులు కూడగట్టుకుందని, ఈసారి ఓటుతో వారికి బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

నవతెలంగాణ-తాండూర్

ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ఎన్నికల విధులు నిర్వహించాలని మంచిర్యాల్ డీజీపీ రాంనాథ్ సుధీర్ కేకన్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి, సీఆర్పీఎఫ్ బలగాలకు విధివిధానాల గురించి వివరించారు. పరిస్థితిని బట్టి ఎన్నికల విధుల్లో అధికారాన్ని వినియోగించాలని సూచించారు. పోలింగ్ బూత్ల వద్ద తగాదాలు గొడవలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ పి. సదయ్య, బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ బన్సీలాల్, రూరల్ సీఐ రాజకుమార్, డివిజన్ పాల్గొన్నారు.



జోరుగా ఇంటింటికి ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎన్నికల ప్రచారంలో చివరి రోజు బీఆర్ఎస్ పార్టీ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండలంలోని యాపల్‌గూడలో రోడ్‌షో నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రోడ్ షోను ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వివరించారు. అదేవిధంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు, అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. మళ్లీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే జోగు రామన్న గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు మంచికట్ల ఆశమ్మ సర్పంచ్ గంగారాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం, మనీతో ఓటర్లను కొంటున్న కోనప్ప



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అధికార పార్టీ సిర్పూర్ నియోజకవర్గంలో మద్యం, మనీ ఎరవేసి ఓటర్లను కొనుగోలు చేస్తున్నారని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ తెలిపారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలు ఆదరిస్తున్నారని, ఆరు గ్యారంటీలతో ప్రజాజీవనం మెరుగవుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పోడు రైతులకు పట్టాలు ఇవ్వడం జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పోడు రైతులందరికీ పట్టాలు అందజేస్తామన్నారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను సైతం పూర్తి చేయలేని అసమర్థుడు సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రాణహితతోపాటూ అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు అన్ని పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లా పరిధిలోకి వచ్చే ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గం సంబంధించి ప్రిసైడింగ్ ఆఫీసర్, ఏపీఓ, ఓపిఓలను నియమించినట్లు తెలిపారు. 1200 కంటే ఎక్కువగా ఓటర్లు ఉండే పోలింగ్ స్టేషన్ పరిధిలో మరో ఓపిఓను అదనంగా కేటాయించడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని రెండు నియోజకవర్గాల్లో వివిధ ఎమ్మెల్యే అభ్యర్థులకు సంబంధించి ప్రచారానికి వచ్చిన నాయకులు కార్యకర్తలు అందరూ వారి సొంత ప్రదేశాలకు వెళ్లిపోవాలని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్నట్లయితే వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. దీనికి సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సైతం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే అటువంటి నాయకులు, కార్యకర్తలకు ఈ విషయాన్ని తెలిపినట్లు వెల్లడించారు. జిల్లాలోని ఓటర్లు నిజాయితీగా ఓటు వేయాలని కలెక్టర్ తెలిపారు. కుల మత వర్గాలకు అతీతంగా ఓటు వేయాలని సూచించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకూడదని పేర్కొన్నారు. మద్యం, నగదు పంచినట్లు ఓటర్ల దృష్టికి వస్తే సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇప్పటికే చాలా ఫిర్యాదులు వచ్చాయని, వారిపై కేసులు సైతం నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో రూ.1.56కోట్ల నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన నగదును ఎన్నికల నిబంధనలను అనుగుణంగా ఉంటే తిరిగి ఇచ్చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించి ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రూ.. 1.56 కోట్లలో ఇంకా లక్షా10వేల వరకు నగదు ఉందని వెల్లడించారు.

మళ్లీ కేసీఆర్ వస్తేనే రైతు సంక్షేమం



నవతెలంగాణ-సిరికొండ

మళ్లీ కేసీఆర్ వస్తేనే రైతు సంక్షేమం ఉంటుందని మాజీ ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. దేశంలోనే రైతులకు పెట్టుబడి సహాయం అందించి, రైతులకు వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. సంపద సృష్టించి అందరికీ పెంచుతున్నారని అన్నారు. ముచ్చటగా మూడోసారి కారుగుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటన్న, ఇక్బాల్, చందు, రాజన్న, రోహిదాస్, లక్ష్మణ్, లతీఫ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవాలని పూజలు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని శివాలయంలో ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్, బోయవాడలోని హనుమాన్ ఆలయంలో బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ గెలవాలని కోరుతూ మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చందు, సునీల్, విజయ్, హరి ప్రసాద్, బిక్కు పాల్గొన్నారు.

వాతావరణ మార్పుతో భయపడాల్సిన అవసరం లేదు

నవతెలంగాణ-నార్నూర్

రోజు రోజుకు వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు బయపడాల్సిన అవసరం లేదని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం మహాగావ్ షేకుగూడలో వైద్యశిబిరం నిర్వహించారు. చలికాలం సమీపిస్తున్న నేపథ్యంలో చిన్నారులకు, వృద్దులకు బయట తిరగనివ్వకుండా స్వెట్టర్ ధరించేవిధంగా జాగ్రత్త పాటించాలని కోరారు. జ్వరం, జలుబు, దగ్గు ఉంటే దగ్గరలోని పీహెచ్‌సీకి తీసుకొని రావాలని పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. దీనితో పాటు మండలంలోని గుంజాల, తాడిహత్నూర్, నాగల్‌కొండ తదితర గ్రామాల్లో వైద్య సిబ్బందితో వైద్యశిబిరం నిర్వహించారు. షేక్‌గూడ, గ్రామంలో జ్వరం జలుబు దగ్గు ఉన్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి 25 మందికి ఉచిత మందులు పంపిణీ చేశారు. డ్రైడే సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యశిబిరం లో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, హెచ్‌ఏ ఈశ్వర్, సుశీల, సింధు, ఆశా చిన్ను తాయి, సంగీత, అనిత అంగన్‌వాడీ శారద ఉన్నారు.

సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థికే ఓటేయాలి

నవతెలంగాణ-తాంసి

సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఆడే గజేందర్‌కే మన సీపీఐ అనుబంధ సభ్యులు కార్యకర్తలు ఓటు వేసి గెలిపించుకోవాలని సీపీఐ నాయకులు చిలుక దేవిదాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకులు చిలుక దేవిదాస్ మాట్లాడారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆడే గజేందర్ గెలుపు కోసం గత పది రోజులుగా తాంసి, భీంపూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్‌కి ఓటు వేయాలని, మండల సీపీఐ నాయకులతో కలిసి ప్రచారం చేశామని అన్నారు. ప్రతి గ్రామంలోని సీపీఐ అనుబంధ సంఘాల సభ్యులను కలిశామని అన్నారు. ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేయడానికి సానుకూలంగా ఉన్నట్టు తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు రెండు ఒకటేనని అన్నారు. గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాల దోచుకున్నారే తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాములు, రమేష్, సట్వాజి, అశోక్ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-తాంసి

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మండల కన్వీనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సీపీఐ నాయకులు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ప్రతి ఒక్కరిని మోసం చేసి అధికారంలో ఉందన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని గత ఎన్నికల్లో మాట ఇచ్చి ఇప్పటివరకు రుణమాఫీ చేయలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పడమే తప్ప ఒక ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని తెలిపారు. పేపర్ లీకేజీలతో ఎందరో విద్యార్థులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు.



ప్రజలకు మేనిఫెస్టోను వివరిస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావాలని చూస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆడే గజేందర్ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించుకుందామని అన్నారు, ఈ కార్యక్రమంలో రామన్న యాదవ్, గంగారెడ్డి, రామ్‌రెడ్డి, అఖిల్, రాకేష్ యాదవ్, దేవిదాస్, రాములు ఉన్నారు.

అనిల్ జాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తాం

- మండల బీఆర్ఎస్ నాయకులు



ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

నవతెలంగాణ-తలమడుగు

బోథ్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తామంటూ మంగళవారం మండల బీఆర్ఎస్ నాయకులు ముమ్మరంగా గడప గడపకు ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కొత్తూరు, కుచులాపూర్, లచ్చంపూర్, లాల్‌ఘడ, లింగి, సుంకిడి, భరంపూర్, అర్లి(కె) తదితర గ్రామాల్లో ప్రచారం చివరి రోజు కావడంతో ప్రతి ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. బోథ్ నియోజకవర్గం నుంచి అనిల్ జాదవ్ అత్యధిక మెజారిటీతో గెలిపించడమే మాలక్ష్యం అంటూ మండల బీఆర్ఎస్ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. పథకాలను దృష్టిలో ఉంచుకొని కారు గుర్తుకు ఓటు వేసి నట్లయితే మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త పథకాలను బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందిస్తారన్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు పిడుగు సంజీవరెడ్డి, కళ్లెం కరుణాకర్‌రెడ్డి, ఆసమ్ రవి, నేతుల గంగన్న, జనార్ధన్, ప్రకాష్, అభిరామ్‌రెడ్డి, వెంకటేష్, ప్రభాకర్, చంద్రకాంత్, అశోక్, దీపక్, చనక్, శ్రీనివాస్‌రెడ్డి, మండలంలోని ప్రతి గ్రామంలో ఆ పార్టీ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు.

ఆఖిరి రోజు ఆకట్టుకునేలా ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగియడంతో ప్రధాన పార్టీ బీఆర్ ఎస్ తమ ప్రచారాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు రోడ్‌షోలను చేపట్టారు. అందులో భాగంగానే భారీ రోడ్‌షోను నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని డైట్ మైదానం నుంచి ప్రారంభమైన భారీ రోడ్‌షో పట్టణ పుర వీధుల గుండా కొనసాగింది. ఎటు చూసిన రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. టీఎన్జీవోస్ రోడ్డు నుంచి నేతాజీ చౌక్, వినాయక చౌక్, ఓల్డ్ బస్ స్టాండ్, అశోక్ రోడ్ మీదుగా గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్ వరకు జన ప్రభంజనంతో రోడ్‌షో సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి బాటన నడుస్తోందని అన్నారు. బీఆర్ఎస్‌ను ఓడగొట్టేందుకు ప్రధాని మోడీతో సహా బీజేపీ అధిష్టానం మొత్తం తెలంగాణలోనే మకాం వేసిందని పేర్కొన్నారు. మతాల



రోడ్‌షోలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

మధ్య చిచ్చు పెడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ధ్వజమెత్తారు. తనను మంత్రిగా తొలగించారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఎమ్మెల్యే తన స్థానంలో బీసీ మంత్రినే నియమించారని తెలిపారు. బండి సంజయ్ స్థానంలో బీసీ వ్యక్తిని ఎందుకు నియమించలేదని ఘాటుగా ప్రశ్నించారు. ప్రజాదరణ కలిగిన బీఆర్ఎస్‌ని ఆదరించి, కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి దోహదపడాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తా..

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తనను ఆదరించాలని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ షోను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరెక్కడ లేవని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ముందున్నామని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించి కారుగుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నల్ల వనితారాజేశ్వర్, ఎంపీపీ దర్శనాల సంగీత, సర్పంచ్ రాగం గంగమ్మ, దొగ్గలి ప్రమీల, మాదవి మయూరి, మాజీ ఎంపీపీ ఈశ్వరి, నాయకులు ఎవన్, రాజన్న, గొవర్ధన్‌రెడ్డి, నారాయణ, విలాస్‌రెడ్డి, అజీమ్‌ఖాన్, సుదీర్ ఉమాకాంత్, అభిమాన్, మోసిన్, ప్రదీప్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం నవంబర్ 29, 2023

పూర్వ విద్యార్థికి ఉపాధ్యాయుల ఆర్థిక సాయం

జన్నారం : మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి చిట్యాల చంద్రశేఖర్ డెంగ్యూ వ్యాధితో అనారోగ్యానికి గురికాగా చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న ఆ పాఠశాల ఉపాధ్యాయులు, మంగళవారం రూ.18,100 నగదును అందించారు. సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి మాట్లాడుతూ పేద విద్యార్థికి ఆ కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి సహాయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రభాకర్, రమేష్, రాజేందర్, సాగర్, శ్రీనివాస్, తిరుపతి, లక్ష్మయ్య, వాసు పాల్గొన్నారు.



నేటి తరానికి మహాత్మా జ్యోతిబాపూలే ఆదర్శప్రాయుడు

● బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్ ● జిల్లా కేంద్రంలో 134 వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి తరానికి మహాత్మ జ్యోతిబాపూలే ఆదర్శప్రాయుడని బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూఫ్నర్ రమేష్ అన్నారు. మహాత్మ జ్యోతి పూలే 134వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ థామస్ పెయిన్ 1791లో రాసిన 'మానవ హక్కులు' పుస్తకం, అమెరికా అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్ జీవిత చరిత్రను చదివి, ఫ్రెంచి విప్లవం గురించి అధ్యయనం చేసి ఎంతో ప్రభావితులయ్యారని అన్నారు. స్త్రీ స్వార్ధరహితంగా తల్లి హృదయంతో అందర్నీ సంరక్షిస్తుందని, స్త్రీ బలహీనురాలు కావడం వల్ల పురుషుడు స్వార్ధపరుడై స్త్రీలను అణచిపెడుతూ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ రావడం వల్ల సమాజం ఇలా దుర్మార్గంగా, స్వార్ధపూరితంగా మారిందని గుర్తించి ఆ రోజుల్లో స్త్రీల కృషిని, మహనీయ సంస్కృతిని పెంపొందించడానికి కృషి చేశారని తెలిపారు. స్త్రీలకు సమాజంలో సమాన హక్కు కల్పించడంలో జ్యోతి బాపులే కృషి వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, బాలేష్, బీసీ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు బొట్టుపెల్లి ప్రశాంత్, నాయకులు నాగపూరి మనోహర్, కోటరే రవీందర్ పాల్గొన్నారు.

కెరమెరి : పూలే అడుగుజాడల్లో నడవాలని మాలి సంఘం మండల అధ్యక్షుడు కావిడే తులసి రామ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిబాపూలే 133వ వర్ధంతి సమావేశంలో పాల్గొనే ఆయన మాట్లాడారు. బహుజనలకు విద్యనందించి వారి జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు జ్యోతిబాపూలేఅని తెలిపారు. అంతకుముందు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆదే శ్యాంరావు, కార్యదర్శి వాడై సోంజీ, నాగుపటేల్, సుధాకర్ హనుమంతు పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌లో మహాత్మా జ్యోతిబాపులే వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ మహాసభ అధ్యక్షులు జ్యోతిబాపులే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్, మండల అధ్యక్షుడు జయరాం, విజయ్, శ్యాంరావు, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రోశన్, మాజీ సర్పంచ్ బాబురావు, సంఘం నాయకులు సందీప్, పాండు, విలాస్, రాకేష్, ప్రతాప్, ప్రకాష్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

కౌటాల : మండలకేంద్రంలో మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు, నికోడె గంగారాం ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మా జ్యోతిబాపులే 133వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మాలీ సంఘం సీనియర్ నాయకులు ఆదే నాందేడ్, కొట్రంగి భీంరావు, యువజన నాయకులు సెండె ముక్తేశ్వర్, మోర్‌లే పాండురంగ, మోర్లె శ్రీకాంత్, శేఖర్, శంకర్ పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలోని కొండపల్లి గ్రామంలో మహత్మా జ్యోతిబాపూలే 133వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలే సేవ సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి సర్పంచ్ ఎంపీటీసీ మొర్లే రఘుపతి, మాలి యువజన సంఘం నాయకులు ప్రజలు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



కౌటాలలో..



ఆసిఫాబాద్‌లో బీసీ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ప్రచార ర్యాలీలతో దద్దరిల్లిన జిల్లా కేంద్రం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజు మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రచార జోరు కొనసాగింది. అధికార పార్టీ తోపాటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుండగా వారికి దీటుగా ఇండిపెండెంట్ అభ్యర్థి కోట్నాక విజయ్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ ర్యాలీ ప్రజల దృష్టిని ఆకర్షించింది.

ఇండిపెండెంట్ అభ్యర్థి విజయ్ భారీ ర్యాలీ

బీజేపీ టికెట్ ఆశించి బంగపడ్డ కొట్నాక విజయ్ చివరి దశలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇప్పటికే అన్ని మండలాల్లో కలియ తిరిగి ప్రచారం చేసిన ఆయన చివరి రోజు జిల్లా కేంద్రంలో 10 మండలాల నుండి పెద్ద ఎత్తున ఆదివాసీలను తరలించి జిల్లా కేంద్రాల్లోని ప్రేమల గార్డెన్ నుంచి చెక్ పోస్ట్ వరకు దాదాపు 8వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించి కొమురం భీం విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

ర్యాలీలతో దద్దరిల్లిన జిల్లా కేంద్రం

స్వతంత్ర అభ్యర్థి కొట్నాక విజయ్ ఆదివాసులతో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ తీయగా ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. ఆదివాసుల నినాదాలతో జిల్లా కేంద్రం దద్దరిల్లింది. కాంగ్రెస్ శ్రేణులు మండలంలోని తుంపల్లి నుండి ఆసిఫాబాద్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.



Format C-1
(For candidate to publish in newspapers TV)
Declaration about Criminal Cases
(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil)No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and Address of candidate : KOTNAKA VIJAY KUMAR
Name of Political Party : INDEPENDENT
Name of Election : Legislative Assembly (Telangana State)
Name of Constituency : 005 - ASIFABAD Assembly Constituency

I KOTNAKA VIJAY KUMAR a candidate for the above-mentioned election, declare for publicinformation the following details about my criminal antecedents:

a)	FIR No. with name and address of Police Staionconcerned	1. Crime No. 179/2017 P.S. Asifabad 2. Crime No. 180/2017 P.S. Asifabad	Not Applicable	Not Applicable
b)	Case No. with Name of the court	1) Crime No,. 179/2017 Pending before Prl J.F.C.M Asifabad 2) Crime No. 180/2017 pending before Prl.J.F.C.M Asifabad	Not Applicable	Not Applicable
c)	Section(s) of Concerned Acts/Codes involved (give no. of the Section, e.g.Section...of IPC etc)	1) U/s 147, 148,448, 353,506,427 r/w 149 OP.C and Sec3 of PDPP Act. 2) U/s. 143,147,148,448,427 r/w 149 I.P.C. and Sec 3 of PDPP Act	Not Applicable	Not Applicable
d)	Brief description of offence	1) Trespassing and obstructing duties, and damaging private property at Collector office, Asifabad. 2) Trespassing and obstructing duties, and damaging private property at collector office, Asifabad	Not Applicable	Not Applicable
e)	Whether charges have been framed (mention Yes or No)	No	Not Applicable	Not Applicable
f)	If answer against (e) above is Yes, thengive the date on which cahrges wereframed	Not Applicable	Not Applicable	Not Applicable
e)	Dates of orders ofconviction	Not Applicable	Not Applicable	Not Applicable
f)	Punishment imposed	Not Applicable	Not Applicable	Not Applicable
(g)	Whether any Appealhas been filedagainst conviction order (Mention Yes or No)	Not Applicable	Not Applicable	Not Applicable
(h)	If answer to (g) above is YES, give details and Present status of appeal	Not Applicable	Not Applicable	Not Applicable

Sd/- KOTNAKA VIJAY KUMAR

నవతెలంగాణ
మంచిర్యాల
బుధవారం నవంబర్ 29, 2023

బీఆర్ఎస్ గెలిస్తేనే సంక్షేమ పథకాల అమలు

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే నిర్విఘ్నంగా సంక్షేమ పథకాలు అమలు అవుతాయని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం జన్నారం సర్పంచ్ భూషణవేణి గంగాధర్‌గౌడ్ తన అనుచరులతో బీఆర్ఎస్‌లో చేచారు అదేవిదంగా ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన ఇతర పార్టీల నాయకులు సైతం చేచారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కేప నర్సిహులు, జంగం రవి, యశోద, భాస్కర్, ఫజల్ ఖాన్, కోఆప్షన్ సభ్యులు మునావర్ అలీ ఖాన్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.



కాకా కుటుంబంతోనే కేసీఆర్ లాభ పడింది : వివేక్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కాక కుటుంభంతోనే కేసీఆర్ లాభ పడిందని చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూరు కేటీఆర్ రోడ్ షోలో కాకా ఫ్యామిలీ ఎం చేసింది అన్న వాక్యలకు మంగళవారం మంచిర్యాల హైటెక్ సిటీలోని వివేక్ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ ఒక్క బచ్చఅని తెలంగాణ ఉద్యమం ఎట్ల ప్రారంభం అయింది కాకా కృషి ఏందని సోయి లేక మాట్లాడుతున్నాడని ఘాటుగా విమర్శించారు. కాకా వెంకటస్వామి తెలంగాణ వాదిఅని 1969లో తూటా దెబ్బలు తిని, ఉద్యమం కోసం ఆనాడు సిడబ్ల్యూసి సమావేశానికి హాజరు కాలేదని తెలిపారు. 2004లో కాంగ్రెస్, టీఆర్ఎస్ పొత్తు కోసం కేసిఆర్ కాకా దగ్గరికి వెంకటస్వామి కృషితోనే పొత్తు కుదిరిందని తెలిపారు. 2013లో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన వ్యక్తిని నేను, కాంగ్రెస్ నుంచి టీఆరెస్‌లోకి పోవడంతోనే సోనియాగాంధీ తెలంగాణ ఆకాంక్షను గుర్తించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యోమం సమయంలో కేసీఆర్ దగ్గర రూపాయి లేదని ఏదైతే సూట్కేస్ అంటున్నావో అందులో నేనే కేసీఆర్‌కు ఇచ్చానని తెలిపారు. చెన్నూరుపై అవగాహన లేక కేటీఆర్ మాట్లాడిండు, సుమన్ కేటీఆర్ ప్రగతి భవన్‌లో జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. అబద్ధాలు చెప్పడం కల్వకుంట్ల కుటుంబం, సుమన్‌కు అలవాటైందని, చెన్నూరు రూపు రేఖలు మారలేదు సుమన్ రూపు రేఖలు మారినైఅని ఎద్దేవాచేశారు. కల్వకుంట్ల కుటుంబం సుమన్ కలసి చెన్నూరులో దోపిడీ చేశారని, ఇసుక దందా కోసమే బ్రిడ్జిలు రోడ్లు వేసిండు అదే నా అభివృద్ధి అని చెప్పుకుంటున్నారన్నారు. కేటీఆర్, సుమన్ మాట మాట్లాడితే సూట్కేస్‌లు అని నా పై ఆరోపణ చేస్తున్నరు, నేను ఒక పారిశ్రామిక వేత్తను 10 వేల కోట్లు ట్యాక్స్ కడుతున్నానని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, సుమన్ అవినీతి అక్రమాలపై విచారణ చేసి జైలుకు పంపడం తప్పదని హెచ్చరించారు. ఎక్కువ భూములు వుండి వ్యవసాయం చేయని వాళ్లకు రైతు బంద్ ఇవ్వడం అవసరమా..? కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుబంధుపై రివ్యూ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చెన్నూరు ఎమ్మెల్యే నల్లాల ఓదేలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చివరి రోజు ప్రధాన పార్టీల విస్తృత ప్రచారం

నవతెలంగాణ-నస్పూర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం ముగింపు రోజైన మంగళవారం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో విస్తృత ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంఎల్ఏ నడిపెల్లి దివాకర్ రావు శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియం నుంచి నస్పూర్ మున్సిపాలిటీలో వార్డులలో నుంచి మంచిర్యాల వరకు బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్ రావు పాత మంచిర్యాల నుంచి ర్యాలీ నిర్వహించి మంచిర్యాల ఐబీ చౌరస్తా, సీసీసీ కార్నర్ మీదుగా శ్రీరాంపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ సీసీసీ కార్నర్ నుంచి మంచిర్యాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



పోటాపోటీగా ర్యాలీలు

జన్నారం : మండల కేంద్రంలో మంగళవారం వారసంత కావడంతో బీఆర్ఎస్ కాంగ్రెస్ బీజేపీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు పోటాపోటీగా ర్యాలీలు నిర్వహించారు. పాత పెట్రోల్ బంక్ నుంచి బస్టాండ్ వరకు ద్విచక్ర వాహనాలతో ఈ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికలకు చివరి రోజు కావడంతో వారసంతా ఉండడంతో, ఈ ర్యాలీలు భారీగా నిర్వహించారు. వారసంతలో రాజకీయ నాయకులకు, మధ్య గొడవలు కాకుండా స్థానిక ఎస్సై పి.సతీష్ అదనపు బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా పార్టీల నాయకులు ర్యాలీలను ముగించుకున్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు, బీజేపీ నాయకులు రితేష్ రాథోడ్, బీఆర్ఎస్ మండల నాయకులు గ్రామాలనుంచి తరలివచ్చిన ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గులాబీమయం అయిన పట్టణం

లక్షెట్టిపేట : ఓటు వేసే ముందు ఆలోచించాలని నడిపెల్లి విజిత్ రావు పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ముగింపులో భాగంగా లక్షెట్టిపేట పట్టణంలో రోడ్ షో, ఉత్కూరు చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజిత్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్న దివాకర్ రావును మరో సారి ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రైతులకు రైతుబంధు ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర ఎన్నికల కమిషన్‌కి విజ్ఞప్తి చేస్తే, వారు సానుకూలంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీలు రైతుబంధు ఇవ్వద్దంటూ లేఖలు రాసి రైతులకు ఇచ్చే రైతుబంధును ఆపిన దుర్మార్గులని అన్నారు. రైతుబంధు వేస్తే రైతులంతా బీఆర్ఎస్ కే ఓటు వేస్తారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి కుట్రలు పన్ని రైతుబంధు ఆపించారని అన్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధిచెప్పాలని అన్నారు. ఇప్పుడు తెలంగాణలో మొత్తం 24 గంటల కరెంటు ఇస్తూ తెలంగాణలోని ప్రతి ఇంటిలో వెలుగులు నింపిందని, రైతుబంధు, దళిత బంధు లాంటి పథకాలతో పాటు కేసీఆర్ కొత్త మేనిఫెస్టో తయారుచేసి సౌభాగ్య లక్ష్మి పథకం కింద 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకి నెలకు రూ.3000 చొప్పున ఇవ్వనున్నామన్నారు. దీంతోపాటు పింఛన్ రూ.5000కు పెంచుతామని, గ్యాస్ సిలిండర్‌ను కూడా కేవలం రూ.400 కే అందించనున్నామని అన్నారు. ఆరోగ్యశ్రీని కూడా రూ.5 లక్షల నుంచి 15 లక్షలకు పెంచనున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేవలం 9 సంవత్సరాలు అవుతుందని, కొన్నిట్లో చిన్న చిన్న పొరపాట్లు ఉండవచ్చని వాటన్నిటిని సరి చేసుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మైనారిటీ నాయకులు నాయిమ్, షేక్ చాంద్ పాల్గొన్నారు.

వివేక్ వెంకటస్వామికి విద్యార్థి సంఘాల మద్దతు

నవతెలంగాణ-మందమర్రి

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామికి విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి. మందమర్రి మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలోని విద్యార్థి సంఘాలన్నీ చెన్నూరు నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వివేక్‌కి మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. నీళ్లు నిధులు నియామకాలతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని (నీళ్లు) కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లు నీటి పాలు చేసి కేసీఆర్ కుటుంబం వేల కోట్లను జేబులో వేసుకొందని, మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిన తెలంగాణ ప్రస్తుతం రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి కూరుకుపోయిందని, నియామకాలు కేసీఆర్ కుటుంబంలో తప్పిస్తే ఏ డిపార్ట్మెంట్ లోను సరిగ్గా లేవని 10 ఏళ్ల తెలంగాణలో ఇప్పటికీ గ్రూప్ 1 లేదు టీచర్ పోస్టులు భర్తీ కాలేదు గారడీ లెక్కలతో 1.60 లక్షల పోస్టులు భర్తీ చేశామని చెప్తున్న కేటీఆర్ ఇదే సమాచారంతో విద్యార్థి నిరుద్యోగుల ముందు చర్చకు సిద్ధమా అంటే నోరు మెదపలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను నిరుద్యోగులను మోసం చేసిందని ఇప్పటికి టీఎస్పీఎస్సీ 17 సార్లు ప్రశ్న పత్రాలు లీక్ చేసిందని దీనితో చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఈ పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. అంతేకాకుండా చెన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రజల సమస్యలను పట్టించుకోని అసమర్థుడని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తెలంగాణను కాపాడే ప్రయత్నంలో అడుగు వేయాలని అందులో భాగంగానే చెన్నూరు నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వివేక్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విద్యార్థులకు నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్, కన్వీనర్ బచ్చలి ప్రవీణ్ కుమార్, సల్మాన్, రేగుంట క్రాంతి కుమార్, కోకన్వీనర్ శేఖర్, బి.అభిరామ్ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు రామగిరి కుమారస్వామి, జిలకర సిద్ధార్థ్, జంగాపల్లి తరుణ్, మురారి, ప్రశాంత్ పాల్గొన్నారు.



నవతెలంగాణ

ప్రతి కార్యకర్త కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-బోథ్

ప్రతి కార్యకర్త కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదని అన్నారు. నవంబర్ 30న ఎన్నికలు ఉండటంతో చేతు గుర్తుకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. అలాగే బోథ్ పట్టణానికి చెందిన దాదాపు 200 మంది మైనార్టీలు వివిధ వర్గాలకు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరారు. అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగ యువత మేల్కొని కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్పు రావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి

నవతెలంగాణ-కడెం

మార్పు రావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6గ్యారంటీల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి చేస్తుందని తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా యువజన సంఘ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శంకర్, మాజీ మండల అధ్యక్షులు వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ తక్కల సత్యనారాయణ, కన్నాపూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, కొత్త మద్దిపడగ సర్పంచ్ జాడి రాజమణి, ఇందుర్, అంబారిపేట్, ఎంపీటీసీ కట్ల సింధుజా సాగర్, మాజీ ఎంపీటీసీ ముత్తినేని తిరుపతి, యువజన కాంగ్రెస్ నాయకులు బరుపటి రమేష్, అంబారిపేట్ ఇంద్రసేన యూత్ అధ్యక్షులు కుమ్మరి రమేష్, పట్టణ అధ్యక్షులు వాజీద్‌ఖాన్, సీనియర్ నాయకులు భూషణ్, అల్లంల మల్లేష్ యాదవ్, రహీమ్, బబ్లు, ఇస్రు, రాజేష్, శ్రీను, మహేష్, రమేష్, శ్రీధర్, సతీష్ పాల్గొన్నారు.

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..



నవతెలంగాణ-బోథ్

ఒక్కసారి అవకాశం ఇవ్వండని, అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్, కళ్యాణలక్ష్మి, మిషన్ భగీరథ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించిందని అన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పథకాలు ప్రవేశపెట్టి ప్రతి వర్గాన్ని ఆదుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులకు మూడు గంటల కరెంటు సరిపోతుందని అనడం ఎంతవరకు సమంజసం అన్నారు. అలాగే 24 గంటలు కరెంట్ ఇచ్చి రైతుల పంటలను సాగునీటి అందించడంలో జరుగుతుందన్నారు. అనంతరం మాజీ మంత్రి గోడం నగేష్ మాట్లాడుతూ రైతుబంధు, రైతులకు రాకుండా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అడ్డుకున్నాయని అన్నారు. కార్యకర్తలు ఇంటింటి వెళ్లి బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించాలని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి మోడీ గ్యారంటీ

- మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమానికి నరేంద్రమోడీ గ్యారంటీ అని, అందరూ మోదీని నమ్మండని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే భరోసానిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రచారం నిర్వహించిన ఆయన స్థానిక అంబేడ్కర్‌చౌక్‌లో ఏర్పాటుచేసిన రోడ్‌షోలో మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం మాట్లాడారు. అవినీతి రహిత తెలంగాణను ఏర్పాటు చేయడం బీజేపీతోనే సాధ్యమవుతుందని అన్నారు. గడిచిన 50, 60 ఏళ్ళలో సాధ్యపడని అభివృద్ధి మోదీ సారథ్యంలో తొమ్మిదేళ్ళలో సాధ్యమైందని అన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం మోదీ ఆలోచిస్తున్నారని, అందుకే దేశంలో దాదాపు 80 కోట్ల మంది నిరుపేదలకు ఉచిత బియ్యం అందిస్తున్నారని తెలిపారు. గడిచిన తొమ్మిదేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఎక్కడెక్కడ డంబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలో ఉందో అక్కడ అభివృద్ధిలో దూసుకుపోతున్నారని వివరించారు. మోదీని ఎదుర్కొనేందుకు విపక్షాలు జట్టు కట్టాయని ఎద్దేవా చేశారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, కాళేశ్వరం సహా అన్నింట్లో అవినీతే పేరుకుపోయిందని విమర్శించారు. నీళ్ల, నిధులు, నియామకాలు అంటూ అధికారంలోకి వచ్చి చేసిన అభివృద్ధి ఏమి లేదని ఎద్దేవా చేశారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ప్రకటించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గ్యారేంటీలకు గ్యారెంటీ లేదని ఎద్దేవా చేశారు. మోడీ గ్యారంటీ అంటే పర్మినెంట్ గ్యారంటీ అని, అందరూ మోడీపై నమ్మకం ఉంచాలని అన్నారు. సరైన నిర్ణయం తీసుకునే సమయం వచ్చిందని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లతో ఎన్నికలకు సిద్ధం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్




నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30న జిల్లాలో నిర్వహించే ఎన్నికలకు రెండు నియోజకవర్గాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో అధికారుల పరిధిలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గతంలో 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రజల అవసరం దృశ్య మరో రెండు పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం ఆసిఫాబాద్‌లో 305 సిర్పూర్‌లో 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు తెలిపారు. వీటిలో 92 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో వెబ్ కాస్టింగ్ పద్ధతి అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 87 సెక్టార్ అధికారులు 87 రూటు అధికారులు పనిచేయనున్నట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 438 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా కేంద్రంలోని పీటీజీ హాస్టల్ ప్రాంగణంలో సిర్పూర్ నియోజకవర్గం సంబంధించి కాగజ్‌నగర్‌లోని సెయింట్ లారెన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూముకు బాక్సులు తరలించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రారంభానికి 90 నిమిషాల ముందు మాక్ పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం నుంచి జిల్లా వ్యాప్తంగా ఏ పార్టీ కూడా ప్రచారం చేయకూడదన్నారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.2,00,24,106 డబ్బుతో పాటు, దాదాపు పది లక్షల విలువ చేసే లిక్కర్ స్వాధీనం చేసుకున్నామని, 300 సెల్ ఫోన్లతో పాటు 3540 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- ఆదిలాబాద్ పార్లమెంటు కోఆర్డినేటర్ నరేష్ జాదవ్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పేద ప్రజల సంక్షేమే ధ్యేయంగా పనిచేసేది కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటేనని, పదేండ్లుగా రాష్ట్రంలో, కేంద్రంలో పరిపాలిస్తున్న పార్టీలు కేవలం పెట్టుబడిదారులకు, భూస్వాములకు కొమ్ముకాసే విధంగా వ్యవహరిస్తున్నాయని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంటు కోఆర్డినేటర్ నరేష్ జాదవ్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కేవలం అంబాని, ఆదాని పెట్టుబడులు పెంచుతున్నాయే తప్పా పేద ప్రజల గురించి పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కుటుంబపాలన కొనసాగిస్తూ వారి ఖజానాను నింపుకోవడానికే సరిపోతుంది తప్పా అన్ని రంగాల్లోని ప్రజలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మెనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారెంటీలను అమలుచేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా పెట్టుబడిదారులకు కొమ్ముకాసే విధంగా చట్టాలు తీసుకురావడంలో చూపిన చొరవ ప్రజల సంక్షేమం కోసం ఏ యొక్క చట్టాన్ని తీసుకురాకపోయారన్నారు. రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతుందని రైతుల సంక్షేమం, నిరుద్యోగుల సమస్య, విద్య, వైద్యం, ప్రత్యేకంగా ఉమ్మడి జిల్లాలో గతంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తుమ్మిడిహేటి వద్ద నిర్మాణానికి తలపెట్టిన తుమ్మిడిహేటి ప్రాజెక్టును నిర్మించకుండా తన స్వార్థం కోసం కాళేశ్వరంలో ప్రాజెక్టు నిర్మించి రూ.కోట్ల తమ కుటుంబానికి సంపాదించుకున్నారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉందని, ఇది కేవలం తెలంగాణ ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న రావి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి షెఖీల్ అహ్మద్ ఉన్నారు.

నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తా

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిరుద్యోగ నిర్మూలన ధ్యేయంగా పనిచేస్తానని స్వతంత్ర అభ్యర్థి నయీమ్ పాషా అన్నారు. మంగళవారం మంచిర్యాల ఐబీ చౌరస్థాలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి రావడానికి ముఖ్య కారణం నిరుద్యోగం, విద్యా వైద్యం అనే మూడు అంశాలపై రావడం జరిగిందని తెలిపారు. తాను డిగ్రీ చదువుకున్నప్పటికీ కూడా ఉపాధి లేక ఇబ్బంది పడ్డానని, తనలా ఎవరు కూడా ఇబ్బంది పడొద్దని, రాజకీయంలోకి వస్తేనే ప్రతి ఒక్క నిరుద్యోగి సమస్య తీర్చగలమని ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం, విద్య ఇవ్వగలుగుతామని అన్నారు. ప్రజలంతా ఆలోచించి సరైన వ్యక్తికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అదేవిధంగా ప్రజలందరూ తాము తమ ఓటు హక్కును కూడా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొంటు రాజేందర్, దాసరి శ్రీకాంత్, షాకీర్, సంపత్, శ్రీనివాస్, రవి, విజయకాంత్, సంతోష్, రాజారావు, రమేష్, శ్రీనివాస్, వంశీ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం

నవతెలంగాణ-దండేపల్లి

నియోజకవర్గంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పనిచేశారని భవిష్యత్తులో కూడా పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి పనిచేస్తారని రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకుడు రంజిత్ రావు ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని తాళ్లపేట నుంచి ముత్యంపేట వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన ధ్యేయంగా పనిచేశారని వారు గుర్తు చేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని మంచిర్యాలకు మెడికల్ కళాశాల తీసుకువచ్చిన ఘనత దివాకర్ రావుది అని అన్నారు. మంచిర్యాలలో మంచికి చెడుకు మధ్య యుద్ధం జరుగుతుందని కాంగ్రెస్ నాయకుల పేరు మీద అనేక కేసులు ఉన్నాయని వారు గెలిస్తే ప్రజలను ముంచుతారని అన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని వేడుకున్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి కారుగుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. తమ ఇంటిపెద్దలకు బిడ్డలా కేసీఆర్ పెన్షన్ ఇస్తూ ఆదుకుంటున్నాడని కారుగుర్తుకు ఓటు వేస్తామని మహిళలు, కార్మికులు, వృద్ధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహీర్, బిట్లింగ్ నారాయణ, కల్లెడ భూమన్న, మల్లు, రజనీకాంత్, సుదర్శన్ పాల్గొన్నారు.